సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



డెంగీ డేంజర్ బెల్స్

జిల్లాలో డెంగీ డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. ఎక్కడ చూసినా చెత్తాచెదారం, మురుగు నీరు నిలవగా పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది.

వివరాలు 8లో ▸



ప్రేమించి పెళ్లి చేసుకుని..

ప్రేమించి పెళ్లి చేసుకుని మోసం చేయడంతో ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించి ప్రియురాలు ఆందోళన చేసింది.

వివరాలు 8లో ▸

కాంగ్రెస్ హయాంలోనే మత్స్యకారులపై నిర్లక్ష్యం

కల్హేర్(నారాయణఖేడ్): కాంగ్రెస్ హయాంలో మత్స్యకారులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యారని ఆత్మ చైర్మన్ రాంసింగ్, కల్హేర్ ఎంపీపీ గుర్రపు సుశీల అంజయ్య, జెడ్పీటీసీ నర్సింహారెడ్డి విమర్శించారు. సోమవారం బాచేపల్లి, నాగధర్, మీర్ఖాన్‌పేట తదితర చెరువుల్లో చేప పిల్లలు విడుదల చేశారు.

సెల్ఫీ విత్ గణేశ్



మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. మీ కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసుకున్న వినాయకుడు ఏదైనా స్పెషల్‌గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం.

99498 49479

న్యూస్‌రీల్

అగ్రిసెట్‌లో జోగిపేట విద్యార్థిని స్టేట్ ఫస్ట్



తేజశ్రీ

వట్‌పల్లి(అందోల్): అగ్రిసెట్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకును సంగారెడ్డి జిల్లా జోగిపేటకు చెందిన గొట్టి ముక్కుల తేజశ్రీ సాధించింది. అగ్రికల్చర్ బీఎస్సీ అర్హత పరీక్ష నిర్వహించగా 87 మార్కులను (హాల్ టికెట్ నంబర్ టీఎస్‌పీ 202330012) సాధించింది. మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధిలోని తునికిలోని డి.రామానాయుడు విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూషన్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ టెక్నాలజీలో డిప్లొమా అండ్ సీడ్ టెక్నాలజీలో రెండు సంవత్సరాల కోర్సును పూర్తి చేసింది. ర్యాంక్ సాధించడం సంతోషంగా ఉందని, కళాశాల అధ్యాపకుల శిక్షణ, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే సాధ్యమైందని తేజశ్రీ 'సాక్షి'కి తెలిపారు.

రేపు లక్ష్మణ్ బాపూజీ జయంతి

సంగారెడ్డి టౌన్ : ఈనెల 27న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ శరత్ సోమవారం తెలిపారు. పట్టణంలోని ఫల పరిశోధనా కేంద్రం వద్ద గల ఆయన విగ్రహానికి బుధవారం ఉదయం 10.30 గంటలకు పుష్పమాలంకరణ గావిస్తామని పేర్కొన్నారు. తర్వాత జెడ్పీ సమావేశ మందిరంలో సమావేశాన్ని నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు, అధికారులు ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ కులసంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటి నంబర్లపై విచారణ చేపట్టాలి

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం గ్రామ పంచాయతీలో నిర్మాణాలు లేకుండా ఇంటి నంబర్లను కేటాయించిన విషయమై విచారణ జరిపించాలని ఉపసర్పంచ్ మమత, వార్డు సభ్యులు కోరారు. సోమవారం కలెక్టర్, ఆర్డీఓ, డీపీఓలకు వినతి పత్రాలను అందించారు. ఎలాంటి నిర్మాణాలు లేకుండా గ్రామపంచాయతీ అధికారులు, ఉన్నతాధికారులు, అక్రమార్కులతో కలిసి ఇంటి నంబర్లను కేటాయించారని విమర్శించారు.

రెజ్లింగ్‌లో ఖేడ్ విద్యార్థుల సత్తా

నారాయణఖేడ్: మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులు హర్షవర్ధన్, మనోజ్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ అండర్–14 విభాగంలో తృతీయ బహుమతులు పొందారు. ఇటీవల ఈ పోటీలు సంగారెడ్డిలో నిర్వహించారు. సోమవారం ఖేడ్ మండలం జూకల్ శివారులోని కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మాగౌడ్ వారిని సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. అభినందనలు తెలిపిన వారిలో ఏటీపీ శివశంకర్, పీఈటీ రామారావు, అధ్యాపకులు శ్రీలక్ష్మి, బాలమణి, గోవిందరావు, విజయ్ కుమార్, వెంకటేశం, సుల్తాన్, శ్రీనివాస్, గుండేరావు, రాములు, విజయలక్ష్మి, అనిల్ కుమార్, సంగ్రాం తదితరులు ఉన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు



ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

• నిరసన గళం

పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ కోరారు. సోమవారం పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి, ఆర్డీఓ కార్యాలయం వద్దకు చేరుకొని విద్యార్థులు నిరసన తెలిపారు. రాష్ట్రంలో 15 లక్షల మంది పేద విద్యార్థులు వాటిపై ఆధారపడి చదువుతున్నారన్నారు. బీఆర్ఎస్ సర్కారు రూ.5,177 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు.

– జహీరాబాద్ టౌన్

ఎన్నికలకు ముమ్మర ఏర్పాట్లు

- పనులు వేగవంతం చేయండి
- కలెక్టర్‌కు సీఈఓ ఆదేశం

సంగారెడ్డి టౌన్ : ఎన్నికల సన్నద్ధతలో భాగంగా చేపడుతున్న ఏర్పాట్లను మరింత ముమ్మరం చేయాలని సీఈఓ(చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్) వికాస్ రాజ్ కలెక్టర్‌కు సూచించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఓటరు నమోదు, మార్పులు–చేర్పులకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, తుదిఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాలలో సదుపాయాలు, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, నామినేషన్ల స్వీకరణ, పోలింగ్ సామగ్రి పంపిణీ, కౌంటింగ్ కేంద్రాలు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం, భద్రతాపరమైన ఏర్పాట్లు ఇతర అంశాలపై సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియను వేగవంతంగా పరిశీలించాలని, ఒక్క దరఖాస్తు పెండింగ్లో ఉండకూడదని, అన్నింటినీ గడువుతేదీలోపు సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ శరత్ సీఈఓ దృష్టికి తెచ్చారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్‌ఓ నగేశ్, రెవెన్యూ డివిజన్ అధికారులు, జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

కమ్యూనికేషన్ ప్లాన్ సిద్ధం చేసుకోండి

వచ్చే ఎన్నికల్లో సెక్టోరల్ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి, మౌలిక సదుపాయాలను పరిశీలించి, సత్వర చర్యలకు నివేదికలు అందించాలన్నారు. ఎన్నికలకు ముందు చేయాల్సిన ఆయా పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రం వారీగా కమ్యూనికేషన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రతి వ్యక్తి స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదన్నారు. అందరూ టీంగా పనిచేయాలని సూచించారు. శిక్షణకు గైర్హాజరైన వారికి సంజాయిషీ నోటీసులు జారీ చేయాలని నియోజకవర్గ ఈఆర్‌ఓలకు సూచించారు. అంతకు ముందు నారాయణఖేడ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, మాస్టర్ ట్రైనర్ కృష్ణ కుమార్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్‌ఓ నగేశ్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ప్రభుత్వం అండ

- అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యం
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ పథకాలను అమలు చేస్తున్నారని, అందరికీ అండగా ఉంటామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రమైన గుమ్మడిదలలో రూ.కోటితో నిర్మించిన బ్రాహ్మణ, నాయీబ్రాహ్మణ, రజక, విశ్వకర్మ, మాల, మన్నుగూడెం యాదవ సంఘాల భవనాలను సోమవారం ప్రారంభించారు. అనంతరం రూ.1.40లక్షల సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకూ శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కులాలకు ప్రభుత్వ ప్రాధాన్యం ఇస్తూ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఒకేసారి గుమ్మడిదలలో ఆరు కుల సంఘాల భవనాలను ప్రారంభించటం సంతోషదాయకమన్నారు. నూతనంగా ఏర్పాటైన గుమ్మడిదల మండలాన్ని రూ.45 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, సర్పంచ్ నర్సింహారెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ఆయా కుల సంఘాల ప్రతినిధులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కులసంఘాల భవనాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

మరింత సహకారం అందిస్తాం

పటాన్‌చెరు: కులమతాలకతీతంగా అన్ని ప్రార్థన, దేవాలయాల అభివృద్ధికి నూతన నిర్మాణాలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విరాళాలు అందిస్తామన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 2వ వార్డులో మసీద్ -ఏ అమీనా అలంగీర్ నిర్మాణానికి ఇది వరకే రూ. 20 లక్షలు అందించగా సోమవారం మరో రూ.30 లక్షలు ఇచ్చారు. భవిష్యత్‌లో మరింత సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 175కుపైగా నూతన దేవాలయాలు, వందకుపైగా మసీదులు, చర్చీలు సొంత నిధులతో నిర్మించానని వెల్లడించారు. నియోజకవర్గంలో మత సమరస్యాన్ని పెంపొందిస్తూ అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. అనంతరం వాణీనగర్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.పది లక్షల విరాళాన్ని అందించారు. అయితే మసీదు నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యేకు.. మసీదు కమిటీ ప్రతినిధులు, మతపెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మసీదు కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

• ఆధ్యాత్మికం



లోకకల్యాణార్థం మహిళలు సంపూర్ణ భగవద్గీత పారాయణం గావించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి పఠించారు. ఇందుకు పట్టణంలోని రాచన్నపేట గణేశ్ యూత్ అసోసియేషన్ వినాయక మండపం వేదికగా మారింది.

– జహీరాబాద్ టౌన్

అట్టహాసంగా జోష్ క్రీడా పోటీలు

- అల్గోల్ మైనార్టీ గురుకులంలో ప్రారంభించిన అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న టిమరీస్ అధికారులు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

జహీరాబాద్ టౌన్: 2వ జిల్లా స్థాయి 'జోష్' క్రీడల పోటీలు అట్టహాసంగా సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని అల్గోల్ మైనార్టీ బాలుర గురుకులంలో మూడు రోజులపాటు జరగనున్న ఈ పోటీలను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. క్రీడల వల్ల ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు. ఓడితే మళ్లీ గెలుపు కోసం ప్రయత్నం చేయాలని సూచించారు. ప్రభుత్వం బంగారు తెలంగాణలో భాగంగా మైనార్టీ గురుకులాల్లో నాణ్యమైన విద్యావసతులతోపాటు క్రీడల పోటీలను నిర్వహిస్తూ ప్రతిభావంతులను తయారు చేస్తోందన్నారు. అల్గోల్ గురుకులంలో విద్యాప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయని కొనియాడారు. అయితే అండర్- 14, 17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్ 10 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభావంతులు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. కార్యక్రమంలో టిమరీస్ డీఐఓ నహిమోద్దీన్, ఆర్ఎల్‌సీ డాక్టర్ నరసింహ, విజిలెన్స్ అధికారి ప్రభువరం, ఆర్మీ సుబేదార్ మేజర్ సురేందర్ గురుసింగ్, గురుకుల, పాఠశాలల ప్రిన్సిపాల్ ఎస్‌కె.జమీల్, రాములు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఖాజాపాషా, పీఈటీలు అనిల్, ఖాసీం, సాగర్, సోలోమాన్ రాజు, ఇమ్రాన్ పాల్గొన్నారు.

మూడు కుటుంబాల్లో విషాదం



లావణ్య



బాలమణి



లక్ష్మి



చరణ్

చెరువులో మునిగి ముగ్గురు మహిళల మృతి, బాలుడి గల్లంతు

మనోహరాబాద్(తూప్రాన్): అప్పటి వరకు సరదాగా మాట్లాడుకుంటూ దుస్తులు ఉతుకుతున్న వారి పాలిట చెరువు యమకూపంగా మారింది. ముగ్గురు మహిళలు మృత్యువాత పడగా, బాలుడు గల్లంతయ్యాడు. మరో మహిళ ప్రాణాలతో బయట పడింది. ఈ విషాదకర ఘటన మనోహరాబాద్ మండలం రంగాయపల్లి చెరువు వద్ద సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రంగాయపల్లికి చెందిన ఫిరంగి చంద్రయ్య, లక్ష్మికి కూతురు లావణ్య (23), ఇద్దరు కుమారులున్నారు. ఆదివారం గ్రామంలో నిర్వహించిన బోనాల పండుగకు లక్ష్మి తన సోదరులు కుటుంబాలను ఆహ్వానించింది. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం అంబర్‌పేట్‌కు చెందిన దుద్దు యాదగిరి, శ్రీకాంత్ డ్రైవర్‌లుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. అక్క లక్ష్మి ఆహ్వానంతో యాదగిరి భార్య బాలమణి (30), శ్రీకాంత్ భార్య లక్ష్మి(25), పిల్లలతో కలసి పండుగకు వచ్చారు.

బట్టలు ఉతికేందుకు వెళ్లి..

సోమవారం మధ్యాహ్నం బట్టలు ఉతికేందుకు ఫిరంగి లక్ష్మి, తన కూతురు లావణ్య(23), మరదళ్లు బాలమణి, లక్ష్మిని తీసుకొని చెరువు వద్దకు వెళ్లింది. వీరి వెంట బాలమణి, యాదగిరి కుమారుడు చరణ్(10) కూడా వచ్చాడు. ఈ క్రమంలో చరణ్ ఆడుకుంటూ నీటిలో మునిగిపోయాడు. గమనించిన తల్లి బాలమణి కాపాడేందుకు ప్రయత్నించి అదుపుతప్పి నీటిలో మునిగిపోయింది. ఆమెను కాపాడేందుకు లావణ్య, లక్ష్మి ఒకరివెంట ఒకరు వెళ్లి నీటమునిగారు. పక్కనే ఉన్న ఫిరంగి లక్ష్మి కాపాడండి అంటూ కేకలు వేస్తూ.. నీళ్లలోకి దిగింది. ఈ క్రమంలో లక్ష్మి కూడా నీటమునిగింది. అదే సమయంలో అటుగా వెళుతున్న ఓ యువకుడు స్పందించి నీటిలో మునిగిపోతున్న లక్ష్మిని బయటకు లాగి నీటిని కక్కించడంతో ప్రాణాపాయం తప్పింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చెరువు వద్దకు చేరుకొని బాలమణి, లక్ష్మి, లావణ్యల మృతదేహాలను బయటకు తీశారు. తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి, డీఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ రావు, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, సర్పంచ్ నాగభూషణం, తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన పోలీసులు, చరణ్ మృతదేహం కోసం గజ ఈతగాళ్లతో గాలిస్తున్నారు.



చెరువులో గాలిస్తున్న గజఈతగాళ్లు

సమస్యలివీ.. పరిష్కరిస్తారా మరి!

- ప్రజావాణికి 39 అర్జీలు

సంగారెడ్డి టౌన్ : ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని శాఖల అధికారులను డీఆర్‌ఓ నగేశ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 39 ఫిర్యాదులను స్వీకరించారు. రెవెన్యూ శాఖకు చెందినవి 17, వివిధ శాఖలకు చెందినవి 22 ఉన్నాయి.

సీబీఐ విచారణ చేపట్టా

టీఎస్‌పీఎస్సీ డైరెక్టర్ జనార్దన్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని, సీబీఐ ఎంక్వయిరీ వేయాలని బీఎస్పీ డిమాండ్ చేసింది. ఆ మేరకు పార్టీ నేతలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

దళితబంధు ఇవ్వాలని...

మనూర్ మండలం బోరంచ గ్రామంలో నిర్మిస్తున్న బసవేశ్వర ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన తమకు నష్టపరిహారం ఇప్పించాలని, అలాగే దళితబంధు వర్తింపజేయాలని దళితులు కోరారు.

వ్యకాస ధర్నా

కంది మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలను ప్రభుత్వ అధికారులు కూల్చడాన్ని నిరసిస్తూ సంగారెడ్డి జిల్లా వ్యకాస (వ్యవసాయ కార్మిక సంఘం) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు.



అర్జీలను స్వీకరిస్తున్న డీఆర్‌ఓ నగేశ్

అంగన్‌వాడీల సమ్మె న్యాయమైనదే



అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్ : అంగన్వాడీల సమ్మె న్యాయమైనదేనని, ప్రభుత్వం వారి డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట 15 రోజుల నుంచి వారు చేస్తున్న సమ్మెకు సోమవారం మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. వారి న్యాయమైన సమస్యల పరిష్కారానికి పోరాడుతుండగా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వారిని బెదిరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని లేకుంటే మూల్యం చెల్లించుకోక తప్పదన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చట్టపరంగా సమ్మె చేస్తుండగా సర్కారు నిర్బంధాల పేరిట అణచివేయాలని చూడటం తగదన్నారు. కేంద్రాలకు తాళాలు వేయగా పగలగొట్టడం చాలా దారుణమైన విషయం అని తెలిపారు. రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలివ్వాలని, పెన్షన్ ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరుతున్నారని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5లక్షలు చెల్లించాలని అడుగుతున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యాదగిరి, శశికళ, రజిత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అమ్మవార్లకు పుస్తెమెట్టెలు అందజేత



అమ్మవార్లకు వారికి బంగారు అభరణాలు అందిస్తున్న భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి ఆలయంలోని అమ్మవార్లకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు గుణపటి విష్ణురెడ్డిమౌలిక దంపతులు సుమారు 56 గ్రాములు బంగారు పుస్తెలు, వెండి మెట్టెలు సోమవారం బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఓ అంజయ్య, ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో హోటల్ దగ్ధం



హోటల్ వద్ద బాధితులు

నారాయణఖేడ్: పట్టణంలోని శివాజీచౌక్ సమీపంలోని రోషన్ హోటల్ సోమవారం తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. ఆదివారం రాత్రి ఎప్పటిలాగే హోటల్ మూసివేసి ఇంటికి వెళ్లినట్లు యజమాని గౌస్ తెలిపారు. తెల్లవారుజామున హోటల్‌లో మంటలు ఎగిసి పడుతున్నాయని చుట్టుపక్కలవారు సమాచారం ఇచ్చారని చెప్పారు. వచ్చి చూసేసరికి అప్పటికే హోటలోని ఫ్రిజ్, విద్యుత్ మీటర్, స్విచ్‌లు, వైరింగ్, సామగ్రి కాలిపోయాయని తెలిపారు. రూ.2లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

చెరువులో పడి వ్యక్తి మృతి



మల్లేశం(ఫైల్)

హత్నూర (సంగారెడ్డి): ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన హత్నూర మండలం నస్తీపూర్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన మంగలి మల్లేశం(45) దౌల్తాబాద్ నుంచి ఎప్పటిలాగే సోమవారం రాత్రి ఇంటికి వెళ్తున్నాడు. మార్గ మధ్యలో చెరువు అలుగు పోస్తున్న ప్రాంతంలో ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. నీటిలో పడి మల్లేశం చనిపోయిన విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కంట్లో కారం చల్లి.. పుస్తెలతాడు చోరీ



శ్వేత

పాపన్నపేట(మెదక్): ఒంటరిగా వెళుతున్న మహిళ కంట్లో కారం చల్లి మెడలో పుస్తెల తాడు ఎత్తుకెళ్లిన సంఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలు. మండలంలోని కుర్తివాడకు చెందిన పుట్టి శ్వేత భర్త బాలరాజు రెండేళ్ల క్రితం చనిపోయాడు. ఆమె తన ఇద్దరు పిల్లలతో అత్తమామలతో కలిసి ఉంటుంది. చుట్టాల ఇంట్లో శుభకార్యం ఉండటంతో రెండు రోజుల క్రితం టేక్మాల్ మండలం వెంకటాపూర్‌కు వెళ్లింది. సోమవారం తన మామ, పిల్లలతో కలిసి తిరిగి ఊరికి రావడానికి బస్సు ఎక్కారు. కుర్తివాడ వద్ద బస్సు దిగి ఊర్లోకి నడుస్తూ వస్తుండగా మార్గమధ్యలో తెలిసిన వాళ్లు రావడంతో వారిని బండిపై పంపింది. తను ఒంటరిగా వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు మాస్కులు ధరించి బైక్‌పై వచ్చి కంట్లో కారం చల్లి రెండున్నర తులాల పుస్తెలతాడు తెంపుకుని వెళ్లిపోయారు. బండికి నంబర్ ప్లేట్ లేదని తెలిపింది. వారితో జరిగిన పెనుగులాటలో కిందపడి శ్వేతకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. మెదక్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, పాపన్నపేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డిలు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

డెంగీ.. డేంజర్ బెల్స్..!



అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య సమస్య
- రోడ్లపై నిలిచిపోతున్న వర్షపు నీరు
- దోమల స్వైరవిహారం
- పత్తా లేని ఫాగింగ్
- డెంగీ రోగులతో ఆస్పత్రులు కిటకిట

జిల్లాలో డెంగీ జ్వరాలు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. ఎక్కడ చూసినా చెత్తాచెదారం, మురుగునీరు నిలిచిపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఫలితంగా దోమల బెడద పెరిగిపోయి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. డెంగీ జ్వరాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. ఈ కేసులు రోజురోజుకూ అధికమవుతున్నాయి.. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి.

ఖర్చు ఎక్కువ.. పనులు తక్కువ

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి మున్సిపాలిటీలో 38 వార్డులు ఉండగా అందులో కొన్ని కాలనీలు నూతనంగా ఏర్పాటయ్యాయి. పట్టణంలో ప్రతిరోజు చెత్తను సేకరించడానికి 250 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. ఆరు ట్రాక్టర్లు రెండు జేసీబీలు, ఒక జట్టింగ్ మిషన్, ఒక ల్యాడర్ ఉన్నాయి. వాటి నిర్వహణ ఖర్చు మొత్తం శానిటేషన్ అధికారులు చూస్తున్నారు. అయితే ఖర్చుకు తగ్గ పనులు జరగడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాలనీలన్నీ చెత్తాచెదారంతో నిండిపోయి దోమల స్వైర విహారం చేస్తున్నాయి. ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద చెత్తాచెదారం దర్శనమిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అలాగే.. వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా.. మున్సిపాలిటీలో ఎక్కడా ఫాగింగ్ చేసిన దాఖలాలు లేవు. ఫాగింగ్ కోసం రూ.లక్షలు వెచ్చిస్తున్నట్టు బడ్జెట్‌లో లెక్కలు చూపిస్తున్నా ఆచరణలో కనిపించడంలేదు. కాగా, జూన్ నుంచి సెప్టెంబర్ 20 వరకు 291 మంది డెంగీ వ్యాధి బారిన పడ్డారు. ఇప్పటికే ప్రభుత్వాసుపత్రిలో చాలా మంది చికిత్స పొందుతున్నారు. కేసుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. డెంగీ కేసుల నమోదు అధికంగా ఉందని వైద్యులు చెబుతున్నారు.



బస్టాండ్ ఆవరణలో పేరుకుపోయిన చెత్త

దోమలకు నిలయాలు

సదాశివపేట (సంగారెడ్డి): దోమల బెడదతో పట్టణ ప్రజలు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలో 26 వార్డుల్లో 60 వేల వరకు జనాభా ఉంది. పారిశుద్ధ్య నిర్వహణ దారుణంగా ఉంది. దోమల నివారణకు అన్ని వార్డులకు ఒకే ఒక్క ఫాగింగ్ మిషన్ ఉంది. అదికూడ ప్రస్తుతం చెడిపోయింది. 12 ఆటోలు, నాలుగు ట్రాక్టర్లు పారిశుద్ధ్య విభాగంలో ఉన్నా నిర్వహణ శూన్యం. దీంతో దోమలు విజంభిస్తున్నాయి. ఫయాజ్‌నగర్, రాఘవేంద్రనగర్, శ్రీరాంనగర్, ఎవరెస్ట్ ఎన్‌క్లేవ్, సిద్ధాపూర్ కాలనీ, మహ్మదీయనగర్, శంభులింగేశ్వర, హనుమాన్‌నగర్, ముర్సేత్‌దర్గా, పొట్టిశ్రీరాములు, రవీంద్రనగర్, ప్రియదర్శినికాలనీ తదితర కాలనీల్లో ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు పెరగడం, చెత్తాచెదారం పేరుకుపోవడం, డ్రైనేజీ, వర్షం నీరు నిలిచిపోవడంతో దోమలకు నిలయాలుగా మారాయని, అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. దాదాపు రోజుకు 150 మంది జ్వరాలతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరుతున్నారని సమాచారం.

రోడ్డుపైనే మురుగునీరు

వట్‌పల్లి(అందోల్): అందోల్ జోగిపేట మున్సిపాలిటీలో 20 వార్డులున్నాయి. చాలా చోట్ల కాలువలు సకాలంలో శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహించి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఆయా కాలనీ వాసులు ఇబ్బందులు పడటమే కాకుండా వ్యాధులకు గురవుతున్నారు. చాలాచోట్ల ప్రధాన వీధుల్లో మాత్రమే కాల్వలను శుభ్రంచేసి మిగిలిన చోట్ల చేయడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం కావడంతో దోమలు విజృంభిస్తున్నాయి. వ్యవసాయ మార్కెట్ ఏరియాలో కాలువల్లో నీరు నిల్వ ఉంటుందని మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇచ్చినా పట్టించుకోవడంలేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.



ఇందిరానగర్ కాలనీలో జననివాసాల మధ్య నుంచి వెళ్తున్న మురికినీరు

మురుగు నీరు- పిచ్చి మొక్కలు

జహీరాబాద్ టౌన్: మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డులు ఉండగా ఐదు పంచాయతీలను ఇటీవల పురపాలక సంఘంలో విలీనం చేశారు. దీంతో వార్డుల సంఖ్య 37కు పెరిగింది. సుమారు 80 వేలకుపైగా జనాభా ఉన్న పట్టణంలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. మున్సిపల్‌లో విలీనమైన పస్తాపూర్, చిన్న హైదరాబాద్, రంజోల్, హోతి(కె),అల్లీపూర్ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కాలువలు లేక రోడ్లపైకి మురుగు నీరుచేరుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓపెన్ ప్లాట్లలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడం వల్ల దోమలు, ఈగలు, పందులకు అవాసాలుగా మారి వ్యాధులు ప్రబలడానికి కారణమవుతున్నాయి. వర్షం వస్తే ఖాళీ స్థలాలు, రోడ్లపై నీరు చేరుతుంది. కొన్ని ప్రాంతాల రోడ్లు చినుక పడితే చాలు చిత్తడి చిత్తడిగా తయారై కాలినడకన వెళ్లడం కష్టమవుతుంది. మురుగు నీటి వల్ల దోమలు, ఈగలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. విషజ్వరాలతో బాధపడుతున్న వారితో ప్రతి రోజు పట్టణంలోని ఏరియా ఆసుపత్రి కిటకిటలాడుతుంది. విలీన పంచాయతీల్లో పారిశుధ్య పనులు కూడా చేపట్టడంలేదు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడంలేదు, ఫాగింగ్ యంత్రాలు ఉన్న నామ మాత్రంగా దోమల నివారణ చర్యలు చేపడుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. జహీరాబాద్ మున్సిపల్‌కు సీఎం కేసీఆర్ రూ. 50 కోట్ల నిధులు మంజూరు చేసినా ఆశించిన మేరకు అభివృద్ధి జరగడంలేదు. మున్సిపల్ అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పస్తాపూర్ పంచాయతీ పరిధిలోని మేస్త్రీ కాలనీలో లోపించిన పారిశుధ్యం

డ్రైనేజీలే ప్రధాన సమస్య

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. చాలా కాలనీల్లో అసలు డ్రైనేజీలే నిర్మించలేదు. ఖాళీ ప్రదేశాలు ఎక్కువగా ఉండడం, పరిశ్రమలు కూడా అధికంగా ఉండడంతో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ప్రభుత్వ, అసైన్డ్, దేవాలయ భూముల చుట్టూ మొత్తం 150 కాలనీలు వెలిశాయి. లక్షకు పైగా జనాభా ఉంది. స్థానిక పెద్ద చెరువు శివారులోని కాలనీల్లో కూడా ప్రజలు దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు ఖాళీ జాగాల్లో వచ్చి నిలిచిపోతోంది. ఎస్‌ఎస్‌ఎల్, లింగమయ్య, టైలర్స్ కాలనీ, మణికంఠ హోమ్స్, జవహర్‌నగర్, టీపీఆర్‌ఆర్ నగర్ శివసాయి హోమ్స్ వీరారెడ్డి కాలనీ ప్రాంతాల్లో అదే పరిస్థితి. అలాగే అమీన్‌పూర్ పాత గ్రామం పరిసర కాలనీల్లోని పీఎస్ఆర్, నరేంద్రనగర్, శంకర్ గ్రీన్‌హోమ్స్ బీరంగూడ, నర్రెగూడెంలోని నవ్య, వీకర్ సెక్షన్ కాలనీల్లో కూడ ఖాళీ జాగాల కారణంగా సమస్యలు నెలకొన్నాయి. శిసాయి నగర్ లాంటి పాత కాలనీల్లో డ్రైనేజీలు నిర్మించకపోవడంతో చెరువుల నుంచి వస్తున్న నీరు డ్రైనేజీ నీటితో కలుషితమవుతూ దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో దోమలు సైరవిహారం చేయడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు.



మణికంఠ హోమ్స్ వైపు ఖాళీజాగాలో చేరిన మురుగునీరు, పిచ్చిమొక్కలు

ఎక్కడ చూసినా విష జ్వరాలే..

రామచంద్రాపురం (పటాన్‌చెరు): శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తెల్లాపూర్ మున్సిపాలిటీలో ప్రజలు విష జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మున్సిపాలిటీ పరిధిలో 17 వార్డులున్నాయి. సుమారు 40 వేలకు పైగా జనాభా ఉంది. ప్రత్యేక మున్సిపాలిటీకి రూ.60 కోట్ల ఆదాయం వస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డు రావడంతో మున్సిపాలిటీ పరిధిలో గ్రేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, బహుళ అంతస్తుల భవనాలు వచ్చాయి. దానితో ఐటీ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ ఉన్నత అధికారులు, వ్యాపారస్తులు ఈ ప్రాంతంలో ఎక్కువగా నివసిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో బస్తీ దవాఖాన, కొల్లూర్, వెలిమెలలో ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. నిత్యం అనారోగ్యంతో ప్రజలు ఆసుపత్రి పాలవుతున్నారు. ఇంద్రనగర్ కాలనీలోని బస్తీ దవాఖానకు నిత్యం 80 మంది రోజుకు వైద్య సేవలు పొందేందుకు వస్తున్నారు. అందులో సుమారు 50 మంది విష జ్వరాలతో బాధపడుతున్నా వారే ఎక్కువగా ఉన్నారు. దానితో పాటు కంటి ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. అదేవిధంగా వెలిమెల, కొల్లూరు ఆరోగ్య ఉప కేంద్రానికి నిత్యం సుమారు 40 మంది రోగులు వస్తుండగా అందులో సగం మంది విష జ్వరాలతో బాధపడుతున్నారు.

శభాష్ పోలీసన్న!

- విద్యార్థికి ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ చేయూత
- బుక్స్, నగదు అందజేత

సిద్దిపేటకమాన్: తండ్రి చనిపోవడం, తల్లి అనారోగ్యం కారణంగా ఓ విద్యార్థి చదువు మానేసి కూరగాయలు అమ్ముతుంది. అమ్మాయి దీన స్థితి తెలుసుకొని ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ చలించిపోయాడు. కొంత డబ్బుతో పాటు బుక్స్ కొనుగోలు చేసి ఇచ్చి మానవత్వం చాటుకున్నాడు. ఈ విషయం తెలుసుకుని పలువురు ఆయనను శభాష్ పోలీస్ అని ప్రశంసించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా ఓదెల గ్రామానికి చెందిన గుగులోత్ లలిత, లింగులు దంపతులు తమ కూతురు, కుమారుడితో కలిసి కొన్నేళ్ల క్రితం సిద్దిపేటకు వచ్చి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. లింగులు కూలీ పనులు చేస్తూ, లలిత కూరగాయలు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరి కూతురు అంజలి మద్దూర్ కేజీబీవీలో 10వ తరగతి, కుమారుడు ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నారు. కాగా ఈ ఏడాది లింగులు అనారోగ్యంతో మృతిచెందాడు. ఆ బెంగతో భార్య లలిత కూడా అనారోగ్యానికి గురై రెండు నెలల క్రితం ఆపరేషన్ చేయించుకుంది. ఇంట్లో నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితితో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో అంజలి తన స్కూల్ మానేసి అమ్మ చేసిన పని కొంత మేరకు తెలిసి ఉండడంతో హైదరాబాద్ రోడ్డులోని అక్షయ గ్రాండ్ హోటల్ సమీపంలో రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముతూ వచ్చిన డబ్బులతో ఇంట్లోకి సామాగ్రి తీసుకెళ్తుంది. వారం రోజుల క్రితం రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తున్న అమ్మాయిని ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ జనార్దన్ గమనించాడు. అమ్మాయి కుటుంబ పరిస్థితుల గురించి తెలుసుకుని చలించిపోయాడు. దీంతో సోమవారం విద్యార్థిని మంజుల, తన పిన్నిని మోడ్రన్ బస్టాండ్ చౌరస్తా వద్దకు పిలిపించి నగదు సాయంతో పాటు బుక్స్ కొనుగోలు చేసి విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఏఎస్‌ఐ ఉమేష్‌తో కలిసి అందజేశారు. దీంతో విద్యార్థిని పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఎవరైనా సాయం చేయాలనుకుంటే 9652213177 నెంబర్‌కు ఫోన్‌పే, గుగుల్‌పే చేసి ఆదుకోవాలని కోరారు.



విద్యార్థినికి బుక్స్ అందజేస్తున్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ జనార్దన్, పక్కన ట్రాఫిక్ ఏఎస్‌ఐ ఉమేష్

విధుల పట్ల నిర్లక్ష్యం వద్దు

జెడ్పీ సీఈఓ రమేశ్

హుస్నాబాద్‌రూరల్ : హుస్నాబాద్ మండల పరిషత్ వివాదం త్వరలో ముగిస్తుందని, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని జెడ్పీ సీఈఓ రమేశ్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రెగ్యులర్ కాబోయే పంచాయతీ కార్యదర్శుల పని తీరును ఆయా గ్రామాలకు వెళ్లి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. సాక్షిలో వచ్చిన 'పోస్టింగ్ హుస్నాబాద్‌లో..విధులు అక్కన్నపేటలో 'కథనానికి స్పందిస్తూ.. మండలాలు విభజన జరిగిన సమయంలో అక్కన్నపేటలో సిబ్బంది లేనందున అక్కడికి సూపరింటెండెంట్ పోస్టును ఇవ్వాల్సి వచ్చిందన్నారు. ఇప్పుడు వీఆర్వోలను వివిధ శాఖలకు పంపించడం వల్ల అక్కన్నపేట మండల పరిషత్‌లో సిబ్బంది ఉన్నప్పటికీ అనుభవం లేనందున సూపరింటెండెంట్‌ను అక్కడ నుంచి హుస్నాబాద్‌కు తీసుకోలేదన్నారు. కలెక్టర్‌కు నివేదించి సూపరింటెండెంట్‌ను హుస్నాబాద్‌కు తీసుకోనేందుకు చర్యలు తీసుకుంటాం. హుస్నాబాద్ మండల పరిషత్ అధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య ముదిరిన వివాదానికి కలెక్టర్ రాగానే పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. సెలవులో వెళ్లిన ఎంపీడీఓ తిరిగి విధుల్లో చేరడమా...? కొత్త వారికి బాధ్యతలు అప్పగించడమా ఏదో ఒకటి జరుగుతుందన్నారు. వీరి వెంట ఇంచార్జి ఎంపీడీఓ సత్యనారాయణ ఉన్నారు.



మాట్లాడుతున్న సీఈఓ రమేశ్

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఇస్నాపూర్ చౌరస్తాలో ఈనెల 23వ తేదీన ఉదయం సుమారు 32 నుంచి 35 ఏళ్ల వయసు గల ఓ గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా.. అదే సమయంలో ముత్తంగి నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని ఆటో డ్రైవర్ కుమ్మరి శివకుమార్ పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. అక్కడి నుంచి గాంధీకి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మృతి చెందాడు. గాంధీలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. సోమవారం ఆటో డ్రైవర్ నుంచి ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రేషన్ బియ్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను పట్టుకున్న సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాలు. మొయినాబాద్ మండలం చిన్న మంగళారంకు చెందిన షేక్ మహ్మద్ ఆటోలో 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక వాడలో విక్రయించేందుకు వచ్చినట్లు బీడీఎల్ పోలీసులకు ఆదివారం సమాచారం అందింది. దీంతో పౌర సరఫరా అధికారులు, పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఆటోతోపాటు 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. పటాన్‌చెరు పౌర సరఫరా డిప్యూటీ తహసీల్దార్ విష్ణు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ షేక్ మహ్మద్, ఓనర్ మహబూబ్‌లపై కేసు నమోదు చేశారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురు అదృశ్యం

బట్టలు అమ్మడానికని వెళ్లి...



ప్రభాకర్

దుబ్బాక: రోజు మాదిరిగా బట్టలు అమ్మడానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన దుబ్బాకలో జరిగింది. ఎస్‌ఐ గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన చీర్లంచ ప్రభాకర్ (54) ఊరూరా తిరుగుతూ బట్టలు అమ్ముతూ ఉంటాడు. రోజు మాదిరిగా ఆదివారం కూడా వెళ్లాడు. రాత్రి అయినా ప్రభాకర్ ఇంటికి రాకపోవడంతో భార్య రాధ ఫోన్ చేసింది. స్విచ్ ఆఫ్ రావడంతో స్థానికులతో కలిసి వెతికినా ఆచూకీ దొరకలేదు. సోమవారం రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రభాకర్ ఇంటి నుంచి వెళ్లినప్పుడు తెల్ల చొక్కా, గోధుమ రంగు ప్యాంట్ ధరించినట్లు చెప్పారు.

తల్లి, ఇద్దరు పిల్లలు ...



లలిత

పటాన్‌చెరు టౌన్: తల్లి, ఇద్దరు పిల్లలు అదృశ్యమైన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాలు. భానూర్ పరిధిలోని కంచర్ల గూడెం గ్రామానికి చెందిన నరేష్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 22వ తేదీన ఆటో తీసుకొని ఉదయం బయటికి వెళ్లి, సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేసరికి భార్య లలిత, పిల్లలు సాయి నిహాల్, రిషికలు కనిపించలేదు. తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం నరేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకుని మోసం చేశాడని..

ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించిన ప్రియురాలు

కల్హేర్(నారాయణఖేడ్): ప్రేమించి పెళ్లి చేసుకుని మోసం చేయడంతో ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించి ప్రియురాలు ఆందోళన చేసింది. సోమవారం కల్హేర్ మండల కేంద్రంలో సంఘటన జరిగింది. బాధితురాలు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా సత్తేపల్లి మండలం తాళ్లచెరువుకు చెందిన కుంచపు రజిని తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కల్హేర్‌కు చెందిన వల్లూరి రమేష్, కుంచపు రజినికి సిద్దిపేటలో పరిచయం ఏర్పడింది. వీరిద్దరు హైదరాబాద్‌లో ఉంటున్నారు. పరిచయం కాస్త ప్రేమగా మారింది. స్నేహితుల సహకారంతో 2022 ఏప్రిల్ 15న వీరిద్దరు వివాహం చేసుకున్నారు. ఏడాదిన్నర పాటు ఇద్దరు కలిసి ఉన్నారు. ఇటీవల ఇంటికి వచ్చిన రమేష్ ఆమెకు దూరంగా ఉంటున్నాడు. దీంతో రజని హైదరాబాద్ కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రమేష్ ఫోన్‌లో అందుబాటులోకి రాకపోవడంతో ఆమె కల్హేర్‌కు వచ్చింది. రమేష్ ఇంటికి తాళం వేసి ఉండటంతో అక్కడే కూర్చుని ఆందోళన చేపట్టింది. న్యాయం చేయాలని కల్హేర్ పోలీస్టేషన్‌లో సంప్రదించింది. రమేష్ తండ్రిని పోలీసులు పిలిచి రమేష్‌ను తీసుకురావాలని ఆదేశించారు. మంగళవారం తీసుకొస్తానని చెప్పాడు.



ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించిన రజిని

కారు డ్రైవింగ్‌పై ఉచిత శిక్షణ

సిద్దిపేటకమాన్: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎస్.శ్వేత అన్నారు. పోలీసుశాఖ, యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆర్థికసాయంతో నిరుద్యోగ మహిళలు, యువతకు కారు డ్రైవింగ్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సీపీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిద్దిపేటలో పైలెట్ ప్రాజెక్ట్‌గా డ్రైవింగ్‌పై మహిళలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 35 మంది మహిళలకు నెలరోజుల పాటు శిక్షణ ఇచ్చి, అనంతరం ఆర్టీఓ అధికారితో మాట్లాడి డ్రైవింగ్ లైసెన్స్ అందించనున్నట్లు చెప్పారు. అలాగే క్యాబ్ కొనుగోలుకు, డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఆఫ్ ఇండియా బ్యాంక్ డిప్యూటీ రీజినల్ హెడ్ రాఘవ, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్, రాజలింగం, సిబ్బంది నజీమ్, నాగరాజు, ఎస్బీ సీఐ రఘుపతిరెడ్డి, కానిస్టేబుల్ పరందాములు పాల్గొన్నారు.

బాధితులకు తక్షణ సాయం

సిద్దిపేటకమాన్: బాధిత మహిళలకు భరోసా కేంద్రం, స్నేహిత మహిళ సపోర్ట్ సెంటర్ అండగా ఉంటుందని సీపీ శ్వేత అన్నారు. ఆ కేంద్రాల సిబ్బందితో సోమవారం సీపీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోక్సో, అత్యాచార బాధితులకు తక్షణ సహాయం అందించాలని సూచించారు. భరోసా సెంటర్ సేవల కోసం 08457-293098, డయల్ 100.. గృహహింస, వరకట్న వేధింపులకు గురైతే స్నేహిత మహిళ సపోర్ట్ సెంటర్ 9494639498కు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ లాఅండ్‌ఆర్డర్ మల్లారెడ్డి, మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ శ్వేత